

మూడు నెలలు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని దన్నానపేట వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఎసి టెక్నీషియన్ గృహ పరికరాలపై ఉచితంగా మూడు నెలల పాటు శిక్షణను అందిస్తామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ అన్నెపు గోపి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత పరీక్షలు నిర్వహించి ధ్రువపత్రాలను ప్రదానం చేస్తామన్నారు. అనంతరం వివిధ పారిశ్రామిక వాడల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించబడునని తెలిపారు. ఈ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు పదో తరగతి, ఐటిఐ, డిప్లమా విద్యార్థులు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 7569077449 ఫోన్ నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

శివారుకు సాగు నీరు సందేహమే!

- వంశధార కాలువల్లో పేరుకు పోయిన గుర్రపుడెక్క
- మొదలుకాని జంగిల్ క్లియరెన్స్ పనులు
- శిథిలావస్థలో షట్టర్లు

వంశధార రైతులకు ఈ సంవత్సరమూ సాగునీటి సమస్యలు పునరావృతమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కుడి, ఎడమ రెండు కాలువల్లో ఎక్కడిక్కడ గుర్రపుడెక్క కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్ మొదలైనా నేటికీ జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టలేదు. దీంతో శివారు భూములకు సాగునీందడంపై అనేక సందేహాలు నెలకొన్నాయి. గుర్రపు డెక్క, పూడిక తీత పనులకు ప్రభుత్వం పభుత్వం గతేడాది ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. జిల్లాలో ఉన్న అందుబాటులో ఉన్న నిధులతో నామమాత్రంగా పనులు చేపట్టారు. ఏటా గుర్రపుడెక్క, జంగిల్ క్లియరెన్స్ పనులను ఆలస్యంగా మొదలు పెట్టడం, వర్షాలు పడటంతో ఆపేయడంతో పూర్తిస్థాయిలో పనులు చేయడం సాధ్యపడటం లేదు. జిల్లాలో ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడంతో గతేడాది మాదిరిగానే శివారుకు సాగునీరు అందే పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



కోటబొమ్మాళి ప్రాంతంలో ఎడమ కాలువపై ఏర్పాటు చేసిన షట్టర్ల దుస్థితి (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడికాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందివ్వాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండటంతో నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందని పరిస్థితి ఏటా పునరావృతమవుతోంది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండటం, కాలువల్లో పెద్ద ఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార ఎడమ కాలువ సామార్థ్యం 2,450 క్యూసెకులు కాగా కాలువ గట్లు బలహీనంగా ఉండటంతో 1600 క్యూసెకులకు మించి నీరు విడిచి పెట్టలేని పరిస్థితి నెలకొంది. అదే విధంగా కుడి కాలువ సామార్థ్యం 800 క్యూసెకులు కాగా, 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది

జిల్లా నిధుల నుంచే గుర్రపుడెక్క తొలగింపు పనులు

కాలువల్లో పెద్ద ఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడంతో నీరు సాఫీగా ప్రవహించని పరిస్థితి ఏటా తలెత్తుతోంది. ప్రభుత్వానికి నిధులు అడుగుతున్నా విడుదల చేయకపోవడంతో జిల్లా అధికారులు వివిధ రకాల ఫండ్స్ నుంచి అత్యవసరంగా నిధులు మంజూరు చేస్తున్నారు. నిధుల మంజూరు, పనులకు పాలనా ఆమోదం తెలపడంతో కొంత జాప్యం జరగుతుండటంతో ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు సాగు నీరందం లేదు.

శిథిలావస్థలో షటర్లు

నరసన్నపేట వంశధార ఇంజినీరింగ్ అధికారులు 2009లో కొనుగోలు చేసిన షట్టర్లలో బయటపడ్డ అవినీతి సాగు రంగానికి శాపంగా మారింది. అధిక ధరకు కొనుగోలు చేశారన్న ఆరోపణలపై సిఐడి రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. ఇప్పటికీ ఆ కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. దాదాపు 15 ఏళ్ల గడుస్తున్నా కేసు తేలకపోవడంతో కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి, జలుమూరు ప్రాంతాల్లో గోడౌన్లలో సుమారు రూ.5 కోట్ల విలువ చేసే 700 షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడయిపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండాపోయింది. వాటిని వేలం వేసి కొత్తగా కొనుగోళ్లు చేయాల్సి ఉంది. అలా చేయాలంటే ప్రభుత్వం కేసును సాధ్యమైనంత తొందరగా ముగింపు పలకాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వం దృష్టి సారిస్తేనే సమస్యకు పరిష్కారం

గత నెలలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు షట్టర్ల సమస్యను లేవనెత్తారు. కోర్టు అనుమతి పొంది షట్టర్లను స్వాధీనం చేసుకోవాలంటూ మంత్రులు నిమ్మల రామానాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులకు సూచించారు. షట్టర్ల సమస్య అధికారుల చేతిలోనే ఉంటే ఈ సమస్య ఎప్పుడో పరిష్కారమయ్యేది. షట్టర్ల కేసు అంశం ప్రభుత్వం జోక్యం చేసుకుంటేగాని పరిష్కారమయ్యే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఇప్పటికయినా ఈ సమస్యపై దృష్టి సారిస్తే రైతులకు సాగు నీటి వెతలు తీరనున్నాయి.



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జిల్లా అభివృద్ధికి కార్యాచరణ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజల ఆలోచనల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధిపై అన్ని శాఖల అధికారులతో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పురోగతికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా.. ఇందుకోసం పెన్షన్లు, వ్యవసాయం, మహిళల భద్రత, ఆస్పత్రి సేవలు, రేషన్, విద్యుత్, ఇసుక, మద్యం, నిత్యావసరాల ధరలు, ఆయాల సౌకర్యాలు వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. యోగాంధ్ర ప్రచారం 2025పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఉపాధి హామీ, గనుల శాఖలో నియంత్రణ వ్యవస్థలు, వర్షాకాలానికి ఇసుక నిల్వలు, నీటి పారుదల పనులు, స్వచ్ఛ భారత్ కింద పారిశుధ్యంపై చర్చించారు. ఆరోగ్య శాఖలో కాలానుగుణ వ్యాధుల నివారణ, నీటి పరీక్షల నిర్వహణపై దృష్టి సారించాలని ఆదేశించారు. రెవెన్యూ అంశాల్లో సాగుబడి భూముల గుర్తింపు, పంటల వైవిధ్యీకరణ, ఆక్రమణల క్రమబద్ధీకరణ, రెవెన్యూ కేసులు, భూమి సమస్యల పరిష్కారంపై అధికారులకు సూచనలు చేశారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద మంజూరైన ఇళ్ల పనుల పురోగతి, ప్రారంభించని ఇళ్లను పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. రోడ్లు, తాగునీరు, అంగన్‌వాడీలు, హాస్టళ్ల నిర్మాణాలపైనా సమీక్షించారు. చివరగా, అధికారులు సంఘీభావంతో, సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. ప్రతి అధికారీ తమ బాధ్యతను గుర్తించి చురుగ్గా పనిచేయాలని హితవు పలికారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒ శ్రీకాంత్ రెడ్డి, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, సిపిఒ ప్రసన్నలక్ష్మి, డిపిఒ భారతి సౌజన్య, వ్యవసాయశాఖ అధికారి కోరాడ త్రినాథరావు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తి, హౌసింగ్ పీడీ నగేష్ పాల్గొన్నారు.



నేరాల కట్టడికి చర్యలు

శ్రీకాకుళం: బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం, వినియోగం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టేందుకు, నేరాలు కట్టడికి చర్యలు చేపట్టామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం గ్రామీణ శివారు ప్రాంతాల్లోపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గోవిందపురం, సిద్ధిపేట, పాత్రనివలస, తండేవలస, గ్రామీణ ప్రదేశాలతో పాటు ఆయా పరిసర ప్రదేశాల్లో పాడుపడిపోయిన ఇళ్లు, తోటలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్ నేరాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు.

మంత్రి ఇలాకాలో ఇన్‌ఛార్జీల మయం

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గ కేంద్రం టెక్కలి మండలస్థాయి అధికారుల నియామకంలో జాప్యం ఏర్పడుతుంది. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రంలోని పలు కీలకమైన శాఖల్లో పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో అంతా ఇన్‌ఛార్జీలతోనే సాగుతుంది. టెక్కలిలో ఉద్యోగ నిర్వహణ కత్తిమీద సాముగా ఉంటుందని అధికారులు భావించి బాధ్యతల స్వీకరణకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. టెక్కలి తహశీల్దార్ నియామకం ఇప్పటి వరకు నియమించలేదు. గతంలో తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి మంత్రి ఒఎస్‌డిగా నియామకం పొంది ఆరు నెలలు కావస్తున్నా తహశీల్దార్ కార్యాలయానికి ఇన్‌ఛార్జీలే కొనసాగుతున్నారు. కీలకమైన రెవెన్యూ అంశాలతో పాటు ప్రభుత్వ భూములను రక్షించే బాధ్యతాయుతమైన కీలకస్థాయి అధికారి నియామకమే ఇన్‌ఛార్జిగా ఉంది. అదేవిధంగా ఈ కార్యాలయంలో పలు విఆర్‌ఒల పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. పేదలకు మంజూరైన కోలనీల్లో అవకతవకలు చోటుచేసుకోవడం, ఇంటి స్థలాలు మార్చుకుని పొజిషన్ ధ్రువీకరణ పత్రాలు పొందడం వంటి వాటిని అరికట్టలేకపోతున్నారనే వాదన వినిపిస్తుంది.

టెక్కలి డిఎస్‌పి కార్యాలయానికి చెందిన అధికారి మార్చిలో ఉద్యోగ విరమణ చేశారు. ఈ స్థానంలో మరో డిఎస్‌పిని నియమించారు. వారూ ఇప్పటి వరకు బాధ్యతలు స్వీకరించలేదు. టెక్కలి సబ్‌రిజిస్ట్రార్ అధికారి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, టెక్కలి పంచాయతీ కార్యాలయ అధికారి పోస్టులు కీలకమైనవే. అవీ ఖాళీగానే ఉన్నాయి. టెక్కలి పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగాఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పూర్తిస్థాయి అధికారులు లేక ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదన్న వాదన వినిపిస్తుంది. ఈ విషయాలు మంత్రి దృష్టిలో ఉన్నా ఆయనా మౌనం దాల్చుతున్నారు. ఇప్పటికైన కీలకమైన అధికారులను నియమించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని మండల వాసులు కోరుతున్నారు.



కురుస్తున్న వర్షం

దంచికొట్టిన వర్షం

పోలాకిలో అత్యధికంగా 91.75 సెం.మీ నమోదు



పాతపట్నం : మహేంద్ర తనయా నదిలో పెరిగిన నీటి మట్టం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం వర్షం దంచి కొట్టింది. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పోలాకిలో అత్యధికంగా 91.75 మి.మీ వర్షపాతం నమోదయింది. కోటబొమ్మాళిలో 89 మి.మీ సంతబొమ్మాళిలో 86.25 మి.మీ నందిగాం మండలం మదనాపురం 84.5 మి.మీ వర్షం కురిసింది. శ్రీకాకుళం మండలం రాగోలులో 77 మి.మీ, శ్రీకాకుళంలో 64.5 మి.మీ గార మండలం బూరవెల్లిలో 60.75 మి.మీ వర్షం కురిసింది. పలాస మండలం చిన్నబాడాంలో 43.75 మి.మీ, గార మండలం తూలుగులో 40.5మి.మీ వర్షపాతం నమోదయింది. నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో భారీగా వర్షపునీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

పాతపట్నం- పర్లాకిమిడి మధ్యలో ఉన్న మహేంద్రతనయా నదిలో నీటి ప్రవాహం పెరిగింది. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా స్థానిక నీలకంటేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉన్న కాజు వే వద్ద నీటి ప్రవాహం పెరగడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాలతో పాటు ఎగువ ఒడిశా ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నదిలో వరద నీరు రావడంతో జలకల కనిపిస్తోందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మూగజీవాలకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు వాపోతున్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న సింహాచలం

ఇంకెన్నాళ్లు...

ప్రజాశక్తి- కొత్తూరు

మండల కేంద్రంలో అలికాం బత్తిలి మెయిన్ రోడ్‌లో గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఉన్న రోడ్డు మధ్యలో ఉన్న పెద్ద పెద్ద గోతులను మరమ్మతు చేయడానికి ఇంకా ఎన్ని సంవత్సరాలు పడుతుందో చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గోతులమయమైన రోడ్డును పరిశీలించారు. సిపిఎం ఆధ్వర్యాన దశల వారీగా అనేక పోరాటాలు చేసిన నేపథ్యం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పందించి నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించారని అన్నారు. నిధులు మంజూరు చేసి మూడు నెలలు కావస్తున్నా... రోడ్డు పనులు చేపట్టలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కారణంగా పాదచారులు, వాహనదారులు ఈ గోతులు వద్ద చాలా ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ఈ రోడ్డును బాగు చేసి ప్రజలకు సౌకర్యం కల్పించలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉండడం బాధాకరమన్నారన్నారు. మాటల ప్రభుత్వం మే గాని చేతల ప్రభుత్వం కాదని దీన్ని బట్టి రుజువు అవుతుందని విమర్శించారు. రోడ్డును బాగు చేయకుంటే ప్రజా ఆందోళనలు తప్పదని హెచ్చరించారు.

జాగిలంతో విస్తృతంగా సోదాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం పట్టణంలో గంజాయి వంటి మత్తు పదార్థాలు, పేలుడు పదార్థాలు అక్రమ నిల్వలు, రవాణాని అరికట్టే చర్యల్లో భాగంగా మంగళవారం ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు రెండో పట్టణ పోలీసులు మంగళవారం జాగిలంతో విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్ ఆవరణంలో అనుమానిత ప్రదేశాలు, కాంప్లెక్స్ పరిసరాల్లో పార్సిల్ సర్వీస్, దుకాణాలు, వాహనాలు తనిఖీలు చేపట్టారు. అనుమానం ఉన్న ప్రయాణికులు లగేజి బ్యాగల్ క్షుణ్ణంగా పరిశీలించి గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, నిషేధిత పేలుడు పదార్థాలు అక్రమ రవాణా, నిల్వలను గుర్తించేందుకు సోదాలు నిర్వహించి పటిష్టమైన చర్యలు చేపట్టారు.



జాగిలంతో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు



తండ్రితో చిన్నారి మేఘన (ఫైల్)

ఒంటరైన చిన్నారి

- చికిత్స పొందుతూ తండ్రి మృతి
- మూడేళ్ల క్రితం తల్లి..

ప్రజాశక్తి- బూర్జ

ఆలనా, పాలనా చూడాల్సిన తల్లిదండ్రులు మూడేళ్లలో ఇద్దరూ మృతి చెందడంతో ఆ చిన్నారి బతుకు ఏమైనట్లని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటి పర్యాంతమవుతున్నారు. అభం, శుభం తెలియని ఆ చిన్నారికి తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించి ప్రయోజకరాలుగా చేస్తామన్న వారి ఆలోచన చేరకముందే తల్లిదండ్రులు మృత్యువాత పడడం పలువురికి కంటతడి పెట్టింది. మూడేళ్ల క్రితం తల్లి సుజాత మృతి చెందగా, తండ్రి మంగళవారం విశాఖలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆ చిన్నారి మేఘన ఒంటరిగా మారడంతో బంధువుల రోదన రోదన వర్ణనాతీతం. వివరాల్లోకి వెళ్తే.. బూర్జ మండలం తుమ్మినాయుడుపేటకు చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కోనాడ మోహనరావు (37) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖపట్నంలోని ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మూడేళ్ల క్రితం ఆయన భార్య సుజాత మరణించగా, మోహనరావుకు పదేళ్ల కుమార్తె మేఘన ఉన్నారు. మృతుడికి తండ్రి రామారావు, తల్లి సత్తెమ్మ, సోదరుడు విసుబాబు ఉన్నారు. మోహనరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. రెండు నెలల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందారు. రెండు నెలల్లో కొత్త లక్కుపురానికి చెందిన పాలవలస ఫీల్డ్ అసిస్టెంట్ ముడిలి అప్పలస్వామి, తుమ్మినాయుడుపేటకు చెందిన మోహనరావు మృతి చెందడంతో ఎంపిడిఒ తిరుపతిరావు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం, ఎపిఒ, ఇసి, టెక్నికల్ అసిసెంట్లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నెహ్రూ కృషి ఎనలేనిది

డిసిసి అధ్యక్షుడు కృష్ణారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వ్యవసాయ పారిశ్రామిక ప్రగతికి జవహర్లాల్ నెహ్రూ ఎనలేని కృషి చేశారని డిసిసి అధ్యక్షుడు అంబటి కృష్ణారావు పేర్కొన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన భవనంలో నెహ్రూ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశానికి మొదటి ప్రధానిగా నెహ్రూ చేసిన సేవలు కొనియాడారు. పంచవర్ష ప్రణాళికలు రూపొందించారన్నారు. ప్రాజెక్టులు, పరిశ్రమలు దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన నెహ్రూ తన సొంత ఆస్తులను కూడా దేశం కోసం ఇచ్చారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఫలాలు సామాన్య ప్రజలకు అందాలని కృషి చేశారన్నారు. నెహ్రూ కన్న కలలను నిజం చేసేందుకు రాహుల్‌గాంధీ పాటుపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సాయిదుల్లాఖాన్, అంబటి లక్ష్మణరావు తదితరులకు తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి వికసిత్ కృషి సంకల్ప అభియాన్ యాత్రలు

కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త భాగ్యలక్ష్మి



ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ నెల 29 నుంచి జూన్ 12 వరకు కృషి విజ్ఞాన కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ యాత్రలు నిర్వహించనున్నట్లు ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోజూ మూడు గ్రామాల్లో యాత్ర ఉంటుందన్నారు. యాత్రల్లో రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు ముఖాముఖి, ఖరీఫ్ సీజన్లో అనువైన పంటలు, అధిక దిగుబడినిచ్చే రకాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కెవికె శాస్త్రవేత్తలు, పరిశోధనా స్థానాల నుంచి వచ్చే శాస్త్రవేత్తలు, భారతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నేరుగా రైతులతో వివిధ పంటల్లో కొత్తరకం వంగడాలు, వ్యవసాయ యాంత్రీకరణ, సాంకేతిక తలపై చర్చ, వ్యవసాయంతో పాటు ఇతర రంగాలైన పశుసంపద, విలువ ఆధారిత ఉత్పత్తులు, సేంద్రీయ వ్యవసాయం, కేంద్ర, రాష్ట్ర పథకాలు అంశాలపై కూడా చర్చ, సందర్శనలు చేపడతామని వివరించారు. వివిధ పంటలను సందర్శించి చీడపీడలను, ఇతర సమస్యలను గుర్తించి నివారణా మార్గాలను సూచిస్తామన్నారు. కొత్త సమస్యలకు పరిశోధన చేపట్టడానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం ద్వారా 2 వేల మంది శాస్త్రవేత్తల బృందాలు 1.5 కోట్ల మంది రైతులను ప్రత్యక్షంగా చేరుకోనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమంలో రైతులందరూ పాల్గొనాలని కోరారు.



రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే

రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన

వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు రెడ్డి శాంతి

పాతపట్నం : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం కాకుండా, తెలుగుదేశం పార్టీ నేతల 'రెడ్‌బుక్' రాజ్యాంగమే రాష్ట్రంలో అమలవుతోందని వైసిపి రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని, పోలీస్ వ్యవస్థ నిర్వీర్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ కక్ష సాధింపులకు పోలీసులను పావులుగా వాడుకుంటూ, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. వైసిపి నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అక్రమ అరెస్టులు చేస్తున్నారని దుయ్యబట్టారు. పౌర హక్కులు, మానవ హక్కులను హరిస్తున్నారని వ్యాఖ్యానించారు. గతంలో మంత్రి నారా లోకేష్ "రెడ్‌బుక్"లో రాసి పెట్టుకున్నానని, అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకుంటానని పలుమార్లు ప్రకటించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ పాలనపై రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆమె అన్నారు.


శిరీషకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఎమ్మెల్యే శిరీషకు ఘన స్వాగతం

ప్రజాశక్తి- పలాస

జర్మనీ దేశంలో నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అక్కడ విజయవంతంగా ముగించికొని తిరిగి కడపలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమెకు పలాస నియోజకవర్గ టిడిపి ముఖ్య నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, కొండే నర్సింహులు, టి.గంగారాం, జి.కె.నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న భవాని

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గిరిశిఖర గిరిజన గ్రామాలైన కేరాసింగి, గూడ గ్రామాల్లో జనసేన పార్టీ నాయకులు కోరికాన భవాని మంగళవారం పర్యటించారు. గిరిజన గ్రామాల్లో పర్యటించి అక్కడి గిరిజన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, రహదారి సౌకర్యాలు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతుల లోపాలపై దృష్టి సారించారు. సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దుక్క బాలరాజు, డోల క్రాంతికుమార్, పిట్ట హరికృష్ణ, సోలాపురం చంటి, చందనగిరి రాజు, రాజ్‌కుమార్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఫ్యాన్, కుర్చీలు అందజేస్తున్న జనసేన నాయకులు

గ్రంథాలయానికి వితరణ

నందిగాం : స్థానిక శాఖాగ్రంథాలయం నందిగాంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఫ్యాను, నాలుగు కుర్చీలు వితరణగా అందజేశారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కూరకుల యాదవ్ చొరవతో టి.కోటయ్య, పి.రఘుపతి, పి.వంశి, బి.సింహాచలం గ్రంథాలయాధికారి అధికారి ఉదయ్ కిరణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా యాదవ్ మాట్లాడుతూ గ్రంథాలయ భవన మరమ్మతులు, ఫర్నిచర్, పుస్తకాల కోసం సహాయ సహకారాలు అందిస్తూ... అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులకు పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.


మహానాడుకు వెళ్తున్న నాయకులు

కదిలిన పసుపుదండు

ప్రజాశక్తి- కవిటి

కడపలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు మణి చంద్రప్రకాష్, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు పొందల కృష్ణారావు, తమరాల వెంకటరమణతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకకు పయనమయ్యారు.


సన్మానిస్తున్న ఢిల్లీరావు

టిడిపి అభివృద్ధికి కృషి

పలాస: టిడిపి అభివృదికి కృషి చేయాలని బొడ్డపాడు తెలుగు యువత అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు కోరారు. మండలంలోని బొడ్డపాడులో టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టిడిపి అభివృద్ధికి కృషి చేసిన నాయకులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల అండమాన్ రాజధాని శ్రీవిజయపుర (పోర్టుబ్లెయర్)లో మున్సిపాలిటీ చెర్మన్‌గా గెలుపొందిన ఎస్.సాహులా మీదర్, 2,14,15వ వార్డు కౌన్సిలర్లుగా గెలుపొందిన టిడిపి నాయకులు రాయుడు సోమేశ్వరరావు, ఎరుపల్లి జోగారావు, బళ్ల పద్మారావు, అండమాన్ టిడిపి కార్యదర్శి బొడ్డు కాంతారావు, సంయుక్త కార్యదర్శి పోతనపల్లి దుష్యంత్, యూత్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, బిలాయ్, ఢిల్లీ, రాజస్థాన్ ప్రాంతంలోని టిడిపి అభిమానులకు సన్మానం చేపట్టారు. బొడ్డపాడు పంచాయతీ టిడిపి అధ్యక్షులు బొడ్డు దుష్యంత్, కళాకారులు కుమార్నాయక్, నాయకులు ఎం.కుమారరాజా, సార జోగా రావు, ఎం. ఖగేశ్వరరావు, బొడ్డు మోహన్, బచచల శంకర్, రాజాం పద్మ పాల్గొన్నారు.

తామర చెరువు బట్టిలో పూడికతీతలు

కొత్తూరు: మండలంలోని కర్లేమ పంచాయతీలో ఉన్న తామర చెరువు బట్టిలో పూడికతీత పనులను ప్రొక్లెయినర్‌తో మంగళవారం నీటి సంఘం ఆధ్వర్యాన చేపట్టారు. అనంతరం పూడికలను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లోతుగెడ్డ ఇందిరామ్, నీటి సంఘం ఉపాధ్యక్షులు పడాల వెంకటకృష్ణ, పొందూరు కొండలరావు, చోడవరపు రాములు పాల్గొన్నారు.


పూడికతీత పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


బూర్జ : మాట్లాడుతున్న ఎంపిడిఒ తిరుపతిరావు


కవిటి : యోగా చేస్తున్న కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి- బూర్జ

స్థానిక ఆయుష్ డాక్టర్ మంగమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తిరుపతిరావు, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, తహశీల్దార్ వై.వి. పద్మావతి, ఎస్ఎంసి అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మంగమ్మ మాట్లా డుతూ యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపిడిఒ ఎం.పావని అన్నారు. మండలంలోని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు యోగ చేయడం వలన మనసుకు ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు అంబల్ల రాంబాబు, మండల పరిషత్ కార్యాలయ ఎఒ వరప్రసాదరావు, ఇఒపిఆర్‌డి రామారావు, ఆయుర్వేద వైద్యాధికారి పూజారి పురుషోత్తమరావు పాల్గొన్నారు.

పాతపట్నం: స్థానిక గ్రంథాలయంలో మండలస్థాయి, సచివాలయ సిబ్బంది యోగా నిర్వహించారు. కార్యక్రమంలో యోగా గురువులు రమేష్, కోటేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు, ఎంపిడిఒ చంద్ర కుమారి, డిప్యూటీ తహశీల్దార్ రమణ, ఎపిఒ సురేష్, ఇఒ కిషోర్ పాల్గొన్నారు.

కవిటి: కవిటి ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ వి.విశ్వేశ్వరరావు, సిబ్బంది, కార్యదర్శులు యోగాసనాలు వేశారు. ఉద్యోగ ఒత్తిడి వల్ల తరచూ చిరాకు, అలసట తప్పదని కానీ యోగా కొన్ని నిమిషాలు చేసిన తర్వాత అలసట తేలిపోయినట్లుందని అన్నారు.

ఇచ్ఛాపురం : నిత్యం యోగా చేయ్యడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తహశీల్దార్ వెంకటరావు అన్నారు. పతంజలి యోగా గురువు సంజీవరెడ్డి ఆధ్వర్యాన యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ జయంత్‌ప్రసాద్ ఆధ్వర్యంలో యోగాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. నౌపడ ఆయు ర్వేద డాక్టర్లు మోహనరావు, డాక్టర్ ప్రవీణ్ కుమార్ యోగాపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ యోగాను నిత్య జీవితంలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్య దర్శి శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్రా కింద శ్రీకాకుళం జిల్లాలో యోగా శిబిరం మంగళవారం చారిత్రక డచ్ బిల్డింగ్ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. యోగాలో వెయ్యి మంది పాల్గొన్న ఈ మహా శిబిరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సారథ్యంలో అధికారులు సమన్వయంతో ఘనంగా నిర్వహించారు. తాగునీరు, అల్పాహారం, శానిటేషన్ వంటి సదుపాయాలు మున్సిపాలిటీ సమకూర్చింది. మున్సిపల్, ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖలతో పాటు ప్రభుత్వ విభాగాల నుంచి వందలాది మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆయుష్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జగదీష్, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, డిఎంహెచ్ఒ అనిత, ఐసిడిఎస్ ఈపడీ శాంతిశ్రీ, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, శ్రీకాకుళం ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిఎస్‌డిఒ శ్రీధర్, పతంజలి యోగ ప్రతినిధి డి.చిన్నబాబు, మున్సిపల్ కమిషనర్ బివిడి ప్రసాదరావు పాల్గొన్నారు.


ఆమదాలవలస : యోగా చేస్తున్న విద్యార్థులు, నాయకులు, అధికారులు


నౌపడ: ర్యాలీ చేస్తున్న అధికారులు


శ్రీకాకుళం : యోగా చేస్తున్న సిబ్బంది

నేడు మీడియా క్రికెట్ టీం ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జూన్ 2, 3, 4 తేదీల్లో గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి జర్నలిస్టు క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఆసక్తి ఉన్న జర్నలిస్టు జట్టు ఎంపికను ఈ నెల 28న ఉదయం ఏడు గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్టు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, మీడియా జెఎసి కన్వీనర్ ఎస్.జోగినాయుడు, జాప్ అధ్యక్షుడు జి.షన్ముఖ రావు, టీం మేనేజర్ పక్కి వేణు తెలిపారు. అక్రిడేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులకు క్రికెట్ శిక్షకుల సమక్షంలో ఎంపిక జరుగుతాయని, ఆసక్తి ఉన్నవారంతా ఈ నెల 28న ఉదయం ఏడు గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానానికి చేరుకోవాలని పేర్కొన్నారు.



కుక్కల బెడద

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్లు, పాత బస్టాండ్, కాంప్లెక్స్ సమీపం, బలగ కూడళ్ల వద్ద కుక్కల బెడద ఎక్కువగా ఉంటుంది. ఆయా కేంద్రాల్లో మాంసం దుకాణాలు ఎక్కువగా ఉండడంతో కుక్కలు గుంపులుగా వాటి వ్యర్థాలు తినేందుకు వస్తున్నాయి. ఆయా సమయాల్లో పాదచారులపై, వాహనదారులపై దాడులకు దిగుతున్నాయి. రాత్రి వేళల్లో వాహనదారులపై భౌ... భౌమంటూ వెంట పడడంతో బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ రోడ్డులో ప్రయాణం చేసేదెలా?

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని బడ్డుమర్రి పంచాయతీ బడ్డుమర్రి నుంచి తెంబూరు వెళ్లే రహదారి పూర్తి అధ్వాన స్థితిలో గోతులమైంది. దీనికి తోడుగా అకాల వర్షాలతో గొయ్యిల్లో నీరు చేరింది. దీంతో ఈ రోడ్డుమీదుగా ప్రయాణం చేయడం ప్రమాదకరంగా ఉందని ఎస్.జె.పురం, రాజన్నపేట, కొత్తూరు, బడ్డుమర్రి గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాలు మొత్తం గిరిజన గ్రామాలు ఐటిడిఎ నుంచి గిరిజన గ్రామాలకు మాత్రం సిసి రోడ్లు పూర్తి స్థితిలో పనులు పూర్తయి బాగానే ఉన్నాయని, బొడ్డుమర్ నుంచి తెంబూరు వెళ్లే ఈ రహదారి మాత్రం అధ్వానంగా ఉంది.


అధ్వానంగా ఉన్న రోడ్డు

కొనసాగుతున్న శిక్షణ శిబిరం


శ్రీకాకుళం : మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మంగళవారం విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు బి. ప్రభాకరరావు ఆంగ్ల వ్యాకరణం బోధించారు. ఉపాధ్యాయుడు రాజశేఖర్ హిందీ వ్యాకరణం బోధించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా, జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి భాస్కరరాజా, సిబ్బంది గణేష్ పాల్గొన్నారు.

అలాగే బలగ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త కందుకూరి వీరేశ లింగం పంతులు వర్ధంతి, మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ నెహ్రూ గిడుగు రామ్మూర్తి, స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, గ్రంథాలయ ఉద్యమ నేతలు అయ్యంకి వెంకట రమణయ్య, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ కోసం అవగాహన కల్పించి చిత్రపటాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాల కథా నిలయం అధ్యక్షులు, లైన్స్‌క్లబ్ సెంట్రల్ ఉపాధ్యక్షులు భోగిల ఉమా మహేశ్వరరావు, సహాయకురాలు అనిత పాల్గొన్నారు.

లావేరు: ప్రతి విద్యార్థి యోగా చేయాలని యోగా శిక్షకులు శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రామస్థాయిలో యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం అని ఈ సందర్భంగా గ్రంథాలయంలో ప్రతిరోజు ఉదయం యోగా కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు యోగా ఆసనాలను వేసి విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు వీరభద్రుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


లావేరు : యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

రమాభాయి జీవితం స్ఫూర్తిదాయకం


రమాబాయి విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న దళిత జెఎసి నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సతీమణి రమాభాయి భీమ్‌రావ్ అంబేద్కర్ జీవితం స్ఫూర్తిదాయకమని ఎయిమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను, జిల్లా దళిత సంఘాల జెఎసి అధ్యక్షులు డా.కంఠ వేణు అన్నారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయం రోడ్డులో ఉన్న పూలే పార్క్‌లో రమాబాయి వర్ధంతి సందర్భంగా మంగళవారం దళిత సంఘాల జెఎసి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా తైక్వాండో శ్రీను మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం బాబా సాహెబ్ అంబేద్కర్ పోరాటం చేసిన సమయంలో ఆయనకు అండగా నిలిచిన ఆదర్శ మహిళ రమాబాయి అంబేద్కర్ అన్నారు. ప్రతిఒక్క మహిళ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా దళిత సంఘాల జెఎసి అధ్యక్షులు డా.కంఠ వేణు మాట్లాడుతూ ఎన్నికష్టాలు ఎదురైనా వాటిని భరిస్తూనే భర్త అంబేద్కర్‌కి రమాబాయి అన్ని విధాలుగా సహకరించారన్నారు. కార్యక్రమంలో పురుషోత్తం రాంబాబు, కొత్తూరు సత్యన్నారాయణ, సాకేటి నాయుడు, పెయ్యల చంటి, నాగరాజు, అప్పన్న, రాము, అబ్బాస్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి తీరు సరికాదు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు గ్రామస్థాయి సమస్యలపై, పోలీసులపై పరిణితితో వ్యవహరించాలని టిడిపి మండల అధ్యక్షుడు సురాడ మోహనరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అప్పలరాజు ఓ ముఠా నాయకుడులా తయారై అరాచకాలకు ఊతమిస్తున్నారన్నారు. గరుడభద్రలో గ్రామస్థాయిలో పరిష్కరించుకోవాల్సిన విషయాన్ని మాజీ మంత్రి పోలీస్‌స్టేషన్ వరకు తీసుకెళ్లి రచ్చ రచ్చ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ స్థలం కబ్జా చేసిన వ్యక్తులను టిడిపి నాయకులు ప్రశ్నిస్తే వారికి వత్తాసు పలకడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కబ్జాదారులను ప్రోత్సహి ంచడం మాజీ మంత్రి నైజమా అని విమర్శించారు. సమావేశంలో టిడిపి నాయకులు ఎ.ఉమామహేశ్వరరావు, కొల్లి రమేష్, రాపాక శాంతారావు, పోతనపల్లి సాంబమూర్తి, నర్తు కామరాజు, అంబటి రామకృష్ణ, నర్తు అప్పారావు, రెల్ల దానయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నాయకులు


ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

హైవేపై ఘోర ప్రమాదం

ప్రజాశక్తి- కవిటి

కవిటి మండలం కొజ్జీరియా గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ రవివర్మ కథనం ప్రకారం సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసు గల వ్యక్తి సిహెచ్.బలరామపురం వైపు నుంచి నడుచుకుంటూ వస్తుండగా... వేగంగా వచ్చిన ట్రాలీ లారీ అతనిని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యక్తి తల తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల అతడి వివరాలు తెలియరాలేదు. మృతుడి శరీరంపై తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ షర్ట్, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ఉన్నాయి. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభినట్టు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అతడిని గుర్తుపట్టగలిగితే 630 9990870 నంబర్‌కు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలో రక్షిత తాగునీటి పథకం ద్వారా సరఫరా అవుతున్న నీటికి మంగళవారం అంతరాయం ఏర్పడింది. కొన్ని పైపులు పనిచేయని కారణంగా మరమ్మత్తులు చేపడుతున్న తరుణంలో బుధవారం కూడా తాగునీటి సరఫరా చేయడం కుదరదని పంచాయతీ ఇన్‌ఛార్జి ఇఒ కిషోర్ కుమార్ తెలిపారు. గురువారం నుంచి యథావిధిగా నీటిని సరఫరా చేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మండలం రావివలసలో ఉన్న ఎండల మల్లికార్జున స్వామి వారి దేవస్థానం వద్ద ఉన్న హుండీలు తెరిచి లెక్కింపు చేస్తామని బుధవారం ఉదయం 10 గంటలకు లెక్కిస్తామని ఇఒ జి.గురు నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ అధికారులు, అర్చకులు, గ్రామ పెద్దలు, యాత్రికుల సమక్షంలో హుండీలు తెరుస్తామని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పలాస

పలాస విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మరమత్తుల కారణంగా ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు, చేపల బజార్, పోలీస్‌స్టేషన్ ఏరియా, బ్రాహ్మణ, పల్లి, బత్తుల, కాపు, డెంకి వీధుల్లో, గాంధీనగర్, మొగిలిపాడు, ఉల్లాసపేట, ఉదయ్‌పురం, తహశీల్దార్ కార్యాలయం, జూనియర్ కళాశాల, శాసనం, సూదికొండ, శివాజీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో మదనాపురం గ్రామంలో యువత చదువుతోపాటు క్రీడలలోనూ రాణించాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం అన్నారు. ఈ సందర్భంగా యువతకు మంగళవారం క్రికెట్ బాట్‌లను ఒదజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాలయాలకు సెలవులు కారణంగా యువకులు చెడుమార్గం వైపు నడవకుండా క్రికెట్, వాలీబాల్, ఖోఖో, చెస్ వంటి క్రీడలవైపు దృష్టి సారించాలన్నారు. తద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని అన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించడంలోనూ, నూతన ఉత్సాహంతో విద్యలో రాణించడంలో తోడ్పడతాయని తెలిపారు. అలాగే ఉద్యోగ అవకాశాల కల్పించేందుకు పోషిస్తాయని అన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు రుంకు అనంతరావు, జనసైనికులు పాల్గొన్నారు.


బ్యాట్‌లు పంపిణీ చేస్తున్న జయరాం

కాలం చెల్లిన కాలువలు.. తప్పని అవస్థలు


- రోడ్లపైనే మురుగు నీరు
- వ్యాప్తి చెందుతున్న వ్యాధులు

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామీణ ప్రాంతాలను సైతం సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం, పాలకులు ప్రతి సభల్లోనూ, సమావేశాల్లోనూ ప్రకటనలు గుప్పిస్తుంటారు. అయితే ఆదిశగా పల్లె ప్రాంతాల్లో కాలువలు, చెత్త కుప్పలను తొలగించేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో మండలంలోని డొంకల పర్త గ్రామ ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

ప్రజాశక్తి- బూర్జ

కాలం చెల్లిన కాలువలతో ఆ గ్రామస్తులు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని డొంకలపర్త గ్రామంలో


ఎస్‌సి కాలనీలో అధ్వాన్నంగా ఉన్న మురుగు కాలువ


కొత్తవీధిలో అధ్వాన్నంగా ఉన్న కాలువ

సమస్యలు తిష్టవేశాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కాలం చెల్లిన కాలువల్లో నీరు నిల్వ ఉండి, రోడ్లపై మురుగు నీరు ప్రవహించడంతో ఆ గ్రామ ప్రజలు రోగాల బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నప్పటికీ ఈ గ్రామంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ గ్రామంలో ఒక కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా ఈ గ్రామానికి పాలకొండ - శ్రీకాకుళం సిఎస్‌పి రోడ్డు నుంచి విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా మూడు నెలల్లో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినప్పటికీ కనీసం వాటి వైపు కన్నెత్తి కూడా చూడలేదని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే గ్రామంలో తాగునీరు కొరత ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లగా మూడు నెలల్లో నాగావళి నది నుంచి నేరుగా ఈ గ్రామానికి నీరు అందజేస్తామని చెప్పినప్పటికీ ఎటువంటి అభివృద్ధి పనులు కూడా చేయలేదని, రూ. 45 లక్షలతో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధుల నుంచి ఏడు పనులకు స్థానిక నాయకులు శంకుస్థాపన చేసినప్పటికీ ఒక్క పని కూడా ప్రారంభించలేదని గ్రామస్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాల్లో కాలం చెల్లిని కాలువలను మరమ్మతులు చేసి మురుగు సమస్యను పరిష్కరించాలని, కొత్త సిసి రహదారులు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ప్రధాన రహదారిలో మురుగు కాలువ